క్లుప్తంగా

12న ఐటీఐలో అప్రెంటిస్ మేళా

మణుగూరు రూరల్: ఈ నెల 2న మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో ఐటీఐ పూర్తి చేసుకున్న యువతీ యువకుల కోసం ఈ అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని సింగరేణి, ఐటీసీ బీసీఎల్, ఫిమకేం, హైద్రాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఐటీఐ పూర్తి చేసి అప్రెంటిస్ చేయని వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

బూర్గంపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు డి.పున్నంచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవటంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, సకాలంలో వేతనాలు చెల్లించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పునరావాసం కల్పించాకే గుడిసెలు తొలగించాలి

బూర్గంపాడు: గోదావరిపై రెండో బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం సారపాకలో 40 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలను ఉన్నపళంగా ఖాళీ చేయాలని ఆదేశించటం సరైనా విధానం కాదని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సారపాకలో కొత్త బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు కోసం గుడిసెలు తొలగింపు చర్యలను స్థానిక నాయకులతో కలసి ఆయన అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు పునరావాసం కల్పించిన తరువాతనే గుడిసెలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జంపన్న, వెంకటమ్మ, అనసూయ, విజయలక్ష్మి,చిన్న సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న నరకుళ్ల శ్రీనివాసరావును మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శుక్రవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాయకులు శ్రీనివాస్, సున్నం రాము, రాజు, నాగేశ్వరరావు, యేసు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చివేయడం హేయం

దుమ్ముగూడెం: రెండేళ్లుగా స్థిర నివాసం ఏర్పరచుకున్న ఆదివాసీ గుడిసెలను పడగొట్టడం హేయమైన చర్య అని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు విమర్శించారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏటపాక మండలం రాజుపేట గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల్లో రెండేళ్లుగా స్థిర నివాసం ఏర్పరచుకున్న ఆదివాసులు గుడిసెలను అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో ఇళ్లు కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ మండలాధ్యక్షుడు కురసం రవి, కారం ఏసుబాబు, మిచ్చా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయాలి

మణుగూరు రూరల్/అశ్వాపురం: నేడు మణుగూరులో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో జరిగే నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మణుగూరు మండలాధ్యక్ష, కార్యదర్శులు ముత్యంబాబు, రామిడి రాంరెడ్డి, అశ్వాపురం మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్న పార్టీ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బెల్ట్‌షాప్‌లను పూర్తిగా నియంత్రించాలి

బూర్గంపాడు: విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేస్తున్న బెల్ట్‌షాప్‌లను ప్రభుత్వం పూర్తిగా నియంత్రించాలని బీఎస్పీ నాయకులు కేసుపాక వెంకటరమణ డిమాండ్ చేశారు. బూర్గంపాడులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో అధికారం మారిన బెల్ట్‌షాప్‌ల నిర్వహణ మాత్రం మారలేదన్నారు. ఎన్నికల్లో బెల్ట్ షాప్‌లను నియంత్రిస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే మరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాడిద దామోదర్, సాడె వీరస్వామి, ఇల్లందుల శేషు, కనుకు సాగర్, పాయం సింగరాజు, గురజాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రబీ

వరినాట్లతో..
వ్యవసాయ క్షేత్రాల్లో సందడి

- మొదలైన యాసంగి సీజన్
- చర్ల మండలంలో 7 వేల ఎకరాలకు పైగానే సాగు


పెద్దిపల్లి సమీపంలో వరినాట్లు వేస్తున్న కూలీలు


జీపీపల్లి సమీపంలో నారు కట్టలు కడుతున్న కూలీలు


దమ్ము చేస్తున్న రైతు

చర్ల: చర్ల మండలంలో రబీ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. చెరువులు, కుంటలు, విద్యుత్ మోటార్ల కింద రబీలో వరి పంటలు సాగు చేస్తున్న రైతులు వరి నాట్ల పనులు ముమ్మరంగా సాగిస్తున్నారు. మండలంలో సాధారణ విస్తీర్ణం 15 వేల ఎకరాలు ఉండగా తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టు కింద సుమారు 8 వేల వరకు ఉంటుంది. అయితే ఈ రబీలో తాలిపేరు ప్రాజెక్టు, కాలువలకు ఉన్న మరమ్మతులను చేపట్టేందుకు రబీలో ప్రాజెక్టు నుంచి సాగునీటిని నిలుపుదల చేసినప్పటికీ విద్యుత్ మోటార్లు, చెరువులు, కుంటల ఆధారంగా రైతులు సుమారు 7 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తుండడంతో గడిచిన ఐదారేళ్లలో మండలంలో రైతులు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తీసుకొని పెద్ద ఎత్తున బోర్లు వేయడంతో పాటు గోదావరి, తాలిపేరు నదులలో విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో తాలిపేరు ప్రాజెక్టు నుంచి సాగునీటి సరఫరా లేనప్పటికీ మోటార్లపై ఆధారపడి రబీలో పెద్ద ఎత్తున వరి పంటలు సాగు చేస్తున్నారు. రబీ కోసం నెల రోజుల క్రితమే రైతులు వరినార్లు పోయగా అవి ప్రస్తుతం నాటేందుకు సిద్ధం కావడంతో మండలంలోని పెద్దిపల్లి, జెట్టిగూడెం, మామిడిగూడెం, గొగుబాక, గొమ్ముగూడెం, పెదమిడిసిలేరు, చినమిడిసిలేరు, బీ కొత్తూరు, ఎస్ కొత్తూరు, జీపీపల్లి, మొగళ్లపల్లి, చింతకుంట, వీరాపురం, సీ కత్తిగూడెం, రామాంజపురం తదితర గ్రామాల్లో సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలు రైతులు, వ్యవసాయ కూలీలతో కోలాహలంగా మారాయి. గత పది రోజుల క్రితం చేపట్టిన వరినాట్ల పనులు మరో వారం రోజుల పాటు కొనసాగనున్నాయి.

కుష్ఠు నివారణపై అవగాహన


మణుగూరు రూరల్ : జూనియర్ కళాశాలలో..


చర్ల రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మణుగూరు రూరల్ : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు గాంధీజీ చేసిన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కుష్ఠు వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. సకాలంలో వైద్యసేవలు అందించినట్లయితే వ్యాధిని నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులతో కుష్ఠు వ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, వైద్యసిబ్బంది రాంప్రసాద్, పుష్ప, ప్రమీల, రవి పాల్గొన్నారు.

చర్ల రూరల్: జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చర్ల మండలంలోని రాళ్లగూడెం పాఠశాలలోని విద్యార్థులకు కుష్ఠు వ్యాధిపై కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీధర్, హోమియోపతి డాక్టర్ పూజ అవగాహన కల్పించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి..


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా నాయకులు బూటారి రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం రాష్ట్ర స్థాయి మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభల బ్యానర్లు, పోస్టర్లు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు గత కొన్ని సంవత్సరాలుగా సరిపడా నిధులు కేటాయింపులు చేయడం లేదని, పైగా ప్రతీ ఏడాది కేటాయింపులు తగ్గిస్తున్నాయన్నారు. ఉపాధ్యాయులు సరిపడా లేక విద్యారంగం నష్టపోతుందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి బి.రవి, మండల కార్యదర్శులు భాస్కర్, జె.బద్రు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డ్‌బాయ్‌లకు ఉపాధి కల్పించాలి

మణుగూరు రూరల్: పర్మినెంట్ వార్డ్‌బాయ్స్ నియామకంలో భాగంగా తొలగించిన ఇద్దరు వార్డ్ బాయ్స్‌ను సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ విభాగంలో ఉపాధి కల్పించాలని ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈ మేరకు ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై ఏరియా సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్‌ను సైతం కలిసి విన్నవించినట్లు ఆయన తెలిపారు. ఐదేళ్లపాటు సేవలందించిన వార్డుబాయిలను తీసేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, మనోజ్‌కుమార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

దుమ్ముగూడెం : మండలంలోని 2020–21, 2021–22 ట్రైకార్ లబ్ధిదారులు ఈనెల 5 నుంచి 7 వరకు నిర్వహించే అకౌంట్ ఓపెన్ ప్రత్యేక క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ముత్యాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోన్ మంజూరై ఇంకా లోన్ అకౌంట్, నాన్ ఆపరేటివ్ అకౌంట్లు తీసుకోని లబ్ధిదారులు మాత్రమే సంబంధిత డాక్యుమెంట్లతో ఈ క్యాంపులో పాల్గొనాలని సూచించారు.

తిరుమలలో ఎమ్మెల్యే జారె పూజలు


కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తిరుమల దేవస్థానం, చిత్తూరు జిల్లాలోని కాణిపాకంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయాలతోపాటు పలు పుణ్యక్షేత్రాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో కుటుంబ సభ్యులతో స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఉచిత వైద్య శిబిరం

చర్ల రూరల్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షల అనంతరం డాక్టర్ పూజ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని గుంపెన కేకాలనీ శివారులోని ఇటుకబట్టీల వద్ద వలస కూలీలకు ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారిణి డా.ప్రియాంక వలస కూలీలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ కృష్ణయ్య, ప్రేమలత, ఆశలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అన్నపురెడ్డిపల్లి: పరీక్షలు చేస్తున్న వైద్యురాలు


చర్ల రూరల్: హోమియో వైద్య శిబిరం..

అవార్డు గ్రహీతకు సన్మానం

భద్రాచలంటౌన్: స్థానిక టీఎన్జీఓ భవనంలో ఉత్తమ సేవ అవార్డు గ్రహీత భద్రాచలం బీసీ బాలుర వసతి గృహ హెచ్‌డబ్ల్యూఓ గద్దల నరసింహారావును ఆత్మీయ సమ్మేళన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. అలవాల రాజా పెరియర్, గౌర్రాజు, రాజేశ్వరరావు, వెంకటేశ్వర్లు, తిరుపతిరావు, డాక్టర్ భాను ప్రసాద్, ఉదయ్, సుమన్ ప్రవీణ్, కిరణ్, రమణయ్య, పెద్దరాజు, రాములు, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, వేణు, ఈశ్వరయ్య, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దమ్మపేట: పురిమళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పుస్తక సమీక్షల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను నాగుపల్లి పాఠశాల హెచ్‌ఎం సరళ శుక్రవారం అభినందించారు. ఇటీవలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పుస్తక సమీక్షల పోటీ ఫలితాలను గురువారం వెల్లడించారు. మండలంలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయి నవీన, పద్మ, చాందినీలు ఈ ఫలితాల్లో విజయం సాధించారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం, తెలుగు టీచర్ సునంద, తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

ముస్లింల సంక్షేమ సంఘం ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ ముస్లిం సంక్షేమ సంఘాన్ని అహ్లె సున్నత్ వల్ జమాత్ వెల్ఫేర్ సొసైటీ పేరుతో శుక్రవారం జుమా నమాజ్ అనంతరం ఏర్పాటు చేసినట్టు సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా షేక్ రబ్బాని, ఉపాధ్యక్షుడిగా ఎండి.ఖాజా మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా ఎండి.సర్వర్ మియా, ఉప కార్యదర్శిగా షేక్ జాకీర్ హుస్సేన్, కోశాధికారిగా ఎండి.ఇలియాస్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండి.ఇబ్రహీంతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ... ముస్లింల సమస్యలను పరిష్కరానికి కృషి చేస్తామన్నారు.

నివాళి

మణుగూరు రూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధి సుందరయ్యనగర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి మునిని నాగేశ్వరరావు శుక్రవారం మృతిచెందగా ఆయన మృతదేహాన్ని పలువురు నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు అయోధ్య మాట్లాడుతూ.. సింగరేణి వైద్యాధికారుల నిర్లక్ష్యం వల్లే నాగేశ్వరరావు మృతిచెందాడని, దీనికి పూర్తి బాధ్యత ఆస్పత్రి సూపరింటెండెంట్ వహించాలన్నారు. సంతాపం తెలిపిన వారిలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి సుధాకర్, రాములు ఉన్నారు.

16న దేశవ్యాప్త సమ్మె

మణుగూరు రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు లక్ష్మీనారాయణ, వెలగపల్లి జాన్, గద్దల శ్రీనివాస్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


డైరీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు రూరల్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయంకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ... ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులకు చర్యలు చేపట్టాలని, బదిలీల్లో రిలీవ్ కానీ ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్యాన్ని ఈహెచ్ఎస్‌ను అమలు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే యూటీఎఫ్ మినీ డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కార్యదర్శి మీరాహుస్సేన్, సభ్యులు ఎం.ఇంద్రసేనారెడ్డి, ఇనుపనూరి రత్నప్రసాద్, వజ్జా కృష్ణమూర్తి, పద్మ, వసంతరావు, తోట విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు..


మాట్లాడుతున్న నాగలక్ష్మి

భద్రాచలం/ భద్రాచలంటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డిప్యూటీ సీఈఓ, భద్రాచలం మండల స్పెషల్ ఆఫీసర్ బి.నాగలక్ష్మి అన్నారు. భద్రాచలం గిరిజన గురుకులంలో శుక్రవారం నిర్వహించిన వాయిస్ ఫర్ గర్ల్స్ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని, అదేవిధంగా చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవదాసు, వైస్ ప్రిన్సిపాల్ ఎల్. సరస్వతి, ప్రోగ్రాం కౌన్సిలర్లు వంశీక, శైలజ, హారిక, చైత్రిక, జాహ్నవి, ప్రియ, మనోజ, స్వాతి, కాత్యాయని, సోనాలి, సాయి శృతి తదితరులు పాల్గొన్నారు.

అడవిలో వేట చట్టరీత్యా నేరం


విల్లులు, ఉచ్చులు, కొమ్ములను స్వాధీనం చేసుకున్న అధికారులు

మణుగూరు రూరల్: అడవులను నరకడం, జంతువులను వేటాడడం చట్టరీత్యా నేరమని మణుగూరు ఎఫ్ఆర్ఓ ద్వాలియా అన్నారు. మణుగూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని మనుబోతులగూడెంలో అటవీ, వన్యప్రాణి సంరక్షణపై అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అటవీ ప్రాంతాల్లో పొగాకు కాల్చరాదని, నిప్పంటించడం వంటి చేయొద్దని, ఈ నిబంధనలను అతిక్రమిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తుల ఇళ్లను పరిశీలించి లభ్యమైన వన్యప్రాణులను వేటాడే విల్లులు, ఉచ్చులను, కనిజి కొమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు


అశ్వారావుపేటరూరల్: బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు


అన్నపురెడ్డిపల్లి: రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ అన్నపూర్ణ

అశ్వారావుపేటరూరల్: గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులుగా పలువురు అధికారులు బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం అశ్వారావుపేట పంచాయతీ ప్రత్యేక అధికారిగా డీఎల్పీఓ రాజీవ్ కుమార్, మండలంలోని వినాయకపురం జీపీలో ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ జీ.శ్రీనివాసరావు, పేరాయిగూడెం జీపీలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌తోపాటు మిగిలిన గ్రామ పంచాయతీల్లో కుడా ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎల్పీఓ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ... పారిశుధ్యం, మౌలికసదుపాయాల కల్పనకే తొలి ప్రాధాన్యత ఇస్తామని, మేజర్ పంచాయతీ పరిధిలో సమస్యలను గుర్తించి, తక్షణమే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీఓ సీతారామరాజు, ఈవో హరికృష్ణ, కార్యదర్శులు హరికృష్ణ, శ్రీరామ్మూర్తి, సిబ్బంది వేల్పుల ముత్తారావు, మనోహర్, రమణ పాల్గొన్నారు.

అశ్వాపురం: మండలంలో 24 గ్రామ పంచాయతీలలో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్‌ల నుంచి ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నారు.

అన్నపురెడ్డిపల్లి: పంచాయతీల ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు శుక్రవారం పంచాయతీలను సందర్శించారు. పంచాయతీలోని రికార్డులను పరిశీలించి, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

కరకగూడెం: మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. కరకగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ బి.శంకర్, రేగళ్లలో తహసీల్దార్ కే.చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కరకగూడెం సర్పంచ్, ఉప సర్పంచ్‌గా సేవలు అందించిన ఊకే రామనాథం, రావుల రవిలను ఎంపీడీఓ శంకర్, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి జీపీ కార్యాలయంలో సత్కరించారు.

సర్పంచ్‌లకు సన్మానం


అశ్వాపురం: ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపడుతున్న ఎంపీడీఓ వరప్రసాద్

చంద్రుగొండ : మండలంలోని సర్పంచ్‌లకు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. 14 పంచాయతీల సర్పంచ్‌లకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాణోత్ పార్వతి, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీలు దార వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సాదియాసుల్తాన, ఎంపీడీఓ రేవతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కరకగూడెం: సర్పంచ్‌ను సన్మానిస్తున్న అధికారులు


చంద్రుగొండలో..

‘వ్యవసాయ’ విద్యార్థుల నిరసన


కళాశాల ఎదుట కళ్లకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ జీవో జారీ చేయడంపై విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులంతా కలిసి కళ్లకు నల్లబ్యాడ్జీలు ధరించి కళాశాల, ప్రధాన గేటు వద్ద గంటపాటు బైఠాయించారు. నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. యూనివర్సిటీ భూముల కేటాయింపు జీఓను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరిన్ని పోరాటాలకు సిద్ధమన్నారు.